సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కన్వీనర్లు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జేసీఎస్ కన్వీనర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కన్వీనర్లు, నాయకులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి కుటుంబం కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా భీమవరంలో జరిగిన అభివృద్ధి, అమలు జరిగిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని అన్నారు. అంతేకాకుండా ప్రజల సమస్యలను తెలుసుకుని నివేదికల రూపంలో తనకు అందించాలని అన్నారు. నియోజకవర్గంలో తాగునీటికి, రోడ్ల నిర్మాణానికి, డ్రెయినేజీ సౌకర్యానికి పెద్ద పీట వేశామని తెలిపారు. నాడు–నేడు పథకంలో రెండు విడతలుగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి మించి అభివృద్ధి చేసిన విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని అన్నారు. తాడేరు వంతెన నిర్మాణానికి రూ.2.30 కోట్ల నిధులను మంజూరు చేయించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశామన్నారు. వంతెన నిర్మాణానికి 4న శంకుస్థాపన చేస్తామని స్పష్టం చేశారు. యనమదుర్రు డ్రెయిన్ పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం నిమిత్తం రూ.36 కోట్ల నిధులను మంజూరయ్యాయన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని కూడా వేగవంతం చేశామన్నారు. జేసీఎస్ కన్వీనర్లు పార్టీ శ్రేణులను కలుపుకుని ముందుకు వెళ్లాలని సూచించారు, ఈ సమావేశంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వీరవాసరం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గూడూరి ఓంకార్, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, కన్వీనర్లు చెల్లబోయిన సూర్య ప్రకాష్, నల్లం రాంబాబు, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, కోమటి రాంబాబు, మానుకొండ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాములోరి ఆలయాల వద్ద విద్యుత్ కాంతులు



స్థానిక వెలంపేట రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

ఆకివీడు: సీతారాములోరి నవరాత్రి పందిళ్లు విద్యుత్ కాంతులతో కనువిందు చేస్తున్నాయి. స్థానిక వెలంపేట రామాలయంలో, కూరగాయల మార్కెట్ వద్ద నవరాత్రి పందిళ్లు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు చేస్తూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. వెలంపేట రామాలయం వద్ద ఆదివారం హోమం నిర్వహించనున్నారు. అయిభీమవరంలోని రామాలయం వద్ద, సిద్దాపురం రామాలయం వద్ద, పలు గ్రామాల్లోని కోదండ రామాలయం వద్ద రాములోరి నవరాత్రి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

14 నుంచి ప్రచార యాత్రలు

సాక్షి, భీమవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 30 వరకు చేపట్టిన ప్రచార యాత్రలు, ప్రచార సభలు విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ రంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కోనాల భీమారావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, బొద్దాని నాగరాజు, నెక్కంటి క్రాంతికుమార్, పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో 11కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై ఆదివారం చెట్లు, కొమ్మలు తొలగించే నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ శనివారం విలేకరులకు తెలిపారు. కొమరాడ రోడ్, గొర్లమూడి, కొమరాడ, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతో పాటు అనాకోడేరు, కొమరాడ గ్రామాలలో ఇండస్ట్రీయల్ లైన్లకు ఉదయం 6:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరా ఆపేస్తామని పేర్కొన్నారు. అలాగే పెదగరువు విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో వెంప, శ్రీరామపురం గ్రామాలకు ఉదయం 7 నుంచి 11 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

18న ప్రైవేట్ స్కూళ్ల జిల్లా స్థాయి సమావేశం

పాలకొల్లు అర్బన్: ప్రైవేట్ స్కూల్స్ జిల్లా స్థాయి సమావేశం ఏప్రిల్ 18న నిర్వహించాలని పాలకొల్లు జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సమావేశంలో నిర్ణయించారు. సంఘ సమావేశం ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ ఆవరణలో శనివారం సంఘ అధ్యక్షుడు మద్దాల వాసు అధ్యక్షతన నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరానికి పాలకొల్లు జోన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎన్.పాపారావునాయుడు, రాష్ట్ర సంఘ కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంప్రసాద్, పాలకొల్లు జోన్ కార్యదర్శి కేవీ కృష్ణవర్మ, కోశాధికారి గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెనుమంట్ర: మార్టేరులో గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలగల చిన్నబాబు ఆలయ మర్యాదలతో శ్రీరంగనాథరాజును సత్కరించారు. ఆయన వెంట ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ మట్ట కుమారి, ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధ , గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, పెనుగొండ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా శనివారం మధ్యాహ్నం స్వామి వారిని ప్రత్యేక రథంపై నుంచి కోలాట నృత్య ప్రదర్శనతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ఆలయ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ లో అన్న సమారాధన నిర్వహించారు. వేసవి ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని పెనుమంట్ర మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కలవపూడిలో ఏర్పాటు చేసిన పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కాళ్ల: మండలంలో పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాళ్ల మండలంలో ఏర్పాటు చేసిన కాళ్ల హైస్కూల్లో 230, కోపల్లెలో 245, కలవపూడిలో 115, ఏలూరుపాడు జెడ్పీ హైస్కూల్లో 230 మంది చొప్పున మొత్తం 820 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర శనివారం తెలిపారు. ఈ నాలుగు కేంద్రాల్లో 41 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. 3వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరగనున్నాయి. 3వ తేదీన తెలుగు, 6న హిందీ, 8న ఆంగ్లం, 10న గణితం, 13న సామాన్యశాస్త్రం (సైన్స్), 15న సాంఘికశాస్త్రం , 17న సంస్కృతం పరీక్షలు నిర్వహించనున్నారు. శనివారం మండలంలోని పరీక్షా కేంద్రాలను కాళ్ల తహసీల్దార్ టి.ఎ.కృష్ణారావు, ఎంపీడీఓ జి.స్వాతి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

ఉపాధి హామీ పథకంలో చెరువు తవ్వకం పనులు



జిన్నూరులో ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న సర్పంచ్

పాలకొల్లు అర్బన్: పంచాయతీకి చెందిన పశువుల చెరువు తవ్వడం వల్ల ఉపాధి కూలీలకు పని లభించడంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవీ అన్నారు. పాలకొల్లు మండలం బల్లిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని గరువులో ఉపాధి హామీ పథకంలో పశువుల చెరువు తవ్వకం పనులకు ఆమె శనివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. 400 పని దినాల అంచాలతో ఈ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుచ్చకాయల శాంత, వైఎస్సార్ సీపీ నేత భూపతిరాజు వేణుగోపాలరాజు (గోపిరాజు), ఇన్‌చార్జ్ ఫీల్డ్ అసిస్టెంట్ బుంగ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

జిన్నూరులో..

పోడూరు: ఉపాధిహామీ కూలీలందరికీ పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిన్నూరు గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. జిన్నూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న మంచినీటి చెరువు తవ్వకం పనులను శనివారం ఆమె పరిశీలించారు. అలాగే ప్రభుత్వం పంపిణీ చేసిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందజేశారు. కార్యక్రమంలో జమ్ము మృత్యుంజయరావు (బుజ్జి), పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రుణ మాఫీ మహిళలకు వరం

ఆకివీడు: డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ ఒక వరమని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మూడో విడత రుణమాఫీ చేసి మహిళలకు ఆసరాగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మహిళా పక్షపాతిగా రాష్ట్రంలో సీఎం పాలన ఉందన్నారు. మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో అనేక పథకాలు అమలుజేస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి పథకం ద్వారా పేద పిల్లల్ని చదివించుకునే అవాకశం ఏర్పడిందన్నారు.కాపు మహిళలకు, ఇతర మహిళలకు చేయూత పథకం ద్వారా ఆర్థికంగా చేయూతనిస్తూ వారి కుంటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేదుకు సీఎం జగన్ పథకాలు తోడ్పడుతున్నాయని చెప్పారు. పేదలంతా లక్షాధికారుల్ని చేస్తూ వారి సొంత ఇంటి కల నెరవేరుస్తున్నారని పార్వతి చెప్పారు. చంద్రబాబు రాష్ట్రంలో రాజకీయం చేస్తున్నారని చెప్పారు. పసుపు కుంకుమతో ఓట్లు కొనేందుకు ప్రయత్నించి భంగపడ్డారని, ఇప్పుడు ఎమ్మెల్యేల ఓట్లను నోట్లతో కొనుగోలు చేసేందుకు కుట్రలు పన్నారని ఆమె ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు డిపాజిట్లు దక్కనివ్వరన్నారు.

మూడు రాజధానుల దీక్షా శిబిరంపై దాడికి ఖండన

సాక్షి, భీమవరం: అమరావతిలో బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మూడు రాజధానుల దీక్షా శిబిరం వద్ద మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచరులు, బీజేపీ నాయకులు బహుజన నాయకులపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని దళిత జేఏసీ నాయకులు పి.వరప్రసాదరావు, గంటా సుందర్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మూడు రాజధానుల దీక్షకు మద్దతు పలుకుతున్నామని స్పష్టం చేశారు. దాడులు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మాదివాడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు

ఆకివీడు: వేసవి దాహార్తిని తీర్చేందుకు పుష్కర కాలంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మోటుపల్లి గంగాధరరావు చెప్పారు. స్థానిక మాదివాడలోని రంగా విగ్రహం వద్ద రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నగర పంచాయతీ కౌన్సిలర్ నిమ్మల నాగు ఏర్పాటు చేశారు. మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన గంగాధరరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా రంగా నిలిచారన్నారు. రంగా సేవలకు స్ఫూర్తిగా ప్రతీ ఏడాది మజ్జిగ చలివేంద్రంను ఏర్పాటు చేస్తున్న కౌన్సిలర్‌నాగును ఆయన అభినందించారు. రూరల్ బ్యాంక్ అధ్యక్షుడు కేశిరెడ్డి మురళీ మాట్లాడుతూ మజ్జిగ చలివేంద్రం ద్వారా ఎంతో మంది దాహార్తిని తీరుస్తున్నారని చెప్పారు. వేసవిలో రెండు నెలల పాటు దాతల సహకారంతో మజ్జిగ చలివేంద్ర కొనసాగుతుందని నిర్వాహకుడు నాగు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, మోరాజ్యోతి, ఎండీ. జహాంగీర్, మోటుపల్లి కుమారి, డీ.వీ. రమణ మూర్తి, మన్నే పోతరాజు,హాస్సేన్, పుప్పాల చిన్నా, చెలంకూరి చలపతి, కుంకట్ల సత్యనారాయణ, ఎండీ. మాబూ పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి



నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ఉండి మండలం పెదపుల్లేరు కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు, క్షత్రియ ప్రముఖుడు కలిదిండి రామచంద్రరాజు (పెదపుల్లేరు రామం) శనివారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెదపుల్లేరు రామం(85) మృతి పట్ల శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, పాతపాటి శ్రీనివాసరావు (వాసు) తదితర వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేసి ఆయన భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గ్రామంలోని శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ప్రస్తుత సొసైటీ అధ్యక్షుడు కలిదిండి సీతారామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిదిండి సుబ్బతాతరాజు, పప్పల రాంప్రసాద్, యడ్ల సత్యనారాయణ, పాటూరి దొరబాబు తదితర నాయకులు సంతాపం తెలిపారు.

ఈఓపీఆర్డీ విచారణ

పాలకోడేరు: పెన్నాడలోని ఒక ఇంటి స్థలం పన్ను విషయంలో కేంద్ర న్యాయ శాఖ మంత్రికి అందిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో పంచాయతీ విస్తరణ అధికారి వీ. రెడ్డియ్య శనివారం విచారణ చేశారు. గ్రామానికి చెందిన చీరా వెంకట సత్యనారాయణ, భార్య వెంకలక్ష్మి కొంత కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. అంధుడైన వెంకట సత్యనారాయణ పేరిట ఉన్న ఇంటి పన్నును 2021 భార్య వెంకటలక్ష్మి తన పేరిట మార్పు చేయించుకున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇరు వర్గాలను విచారించి రికార్డు చేసిన వివరాల ప్రతులను ఉన్నతాధికారులకు పంపుతానని రెడ్డియ్య తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



రాములూరి నవరాత్రి ఉత్సవాల్లో కూరగాయల మార్కెట్ వద్ద నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆకివీడు: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. స్థానిక కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 48వ వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో హరికథ, బుర్రకథ, కూచిపూడి నృత్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. శనివారం రాత్రి చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.

రామాలయం వద్ద అన్నసమారాధన



గొల్లవానితిప్ప గ్రామంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో కోదండ రామాలయం వద్ద శ్రీరామనవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం ఘనంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు సహస్ర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ వంటకాలతో సుమారు 4 వేల మందికి ఘనంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను సీతారామ ఆధ్యాత్మిక సేవా సమితి సభ్యులు కొప్పర్తి తాతాజీ, గుద్దటి రవికుమార్, సవరపు సూర్యనారాయణ, కొప్పర్తి రమేష్ నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాళ్లలో అన్నసమారాధ

కాళ్ల: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండల కేంద్రమైన కాళ్లలో కోదండరామాలయం వద్ద శనివారం అన్న సమారాధన నిర్వహించారు. తొలుత పలు రకాల పిండి వంటలతో స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. దాతలు, భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను గ్రామ పెద్దలు, రామాలయం కమిటీ సభ్యులు, భక్తులు పర్యవేక్షించారు.

కోడిపందేలపై దాడి

పాలకోడేరు: కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి గరగపర్రు శివారులో శనివారం కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి రూ.2,100 నగదు, కోడి, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

సాక్షి, భీమవరం: బాలికపై అత్యాచారయత్నం కేసులో పట్టణానికి చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో ఓ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలిక తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన కె.వెంకట దుర్గాదివాకర్ అనే 49 ఏళ్ల వ్యక్తి బాలికపై అత్యాచారానికి ప్రయత్నించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయగా స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



గుడ్లు, బియ్యం ఇతర వంట సామగ్రిని పరిశీలిస్తున్న ఎండిఎం కోఆర్డినేటర్ కృష్ణారావు

పాలకొల్లు సెంట్రల్: ప్రతీ విద్యార్థికి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందివ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తుందని మధ్యాహ్న భోజన పథకం జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు తెలిపారు. శనివారం పాలకొల్లులో బివిఆర్ఎం గరల్స్ హైస్కూల్, సింగోడియన్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ రెండు పాఠశాలల్లో భోజన పథకం బాగుందన్నారు. విద్యార్థులకు అన్ని సక్రమంగా అందుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1382 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందన్నారు. ఈ పాఠశాలల్లో 1,16,768 మంది విద్యార్థులు ఉన్నారని వీరిలో ప్రతీరోజు దాదాపుగా 96 వేల మంది పాఠశాలలకు హాజరైనా 75 నుండి 80 వేల మంది విద్యార్థులు పాఠశాలల్లోనే భోజనం చేస్తున్నారన్నారు. రోజుకు 85 వేల గుడ్లు సరఫరా చేస్తున్నామన్నారు. అంటే కొందరు భోజనం చేయకపోయినా గుడ్డు తింటే ఇవ్వాలని అందువల్లే గుడ్లు అధికంగా ఇస్తున్నామన్నారు. చిక్కీలు 90 వేల మందికి అందజేస్తున్నామన్నారు. ఇటీవల నూతనంగా ప్రారంభించిన రాగి జావ వల్ల వారానికి మూడు రోజులు సోమ, బుధ, శుక్ర వారాల్లో చిక్కీలు, మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ అలాగే వారానికి ఐదు రోజులు గుడ్డు అందిస్తున్నామన్నారు. గుడ్డు మాత్రం పది రోజుల్లోనే ఖర్చు చేయాలన్నారు. పది రోజులు దాటిన గుడ్డును విద్యార్థులకు వండి పెట్టకూడదన్నారు. పది రోజులు దాటిన తరువాత విద్యార్థులకు గుడ్డు పెడుతున్నారనే ఉద్దేశంతో పది రోజులకో సారి గుడ్డుపై వేసే ముద్ర రంగ మారుస్తున్నామన్నారు. మెనూలో విజిటబుల్ పలావ్, పులిహోర, కూరగాయల రైస్, ఆకు కూర, చక్రపొంగలి, కుర్మా, సాంబార్, బ్రౌన్‌రైస్ వంటివి ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వై. ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో తోటబడి



మామిడిసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

నరసాపురం రూరల్: మామిడికాయలకు వచ్చే తెగుళ్ళపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మందులు పిచికారీ ద్వారా నివారించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.దుర్గేష్ తెలిపారు. శనివారం రామన్నపాలెం పంచాయతీలో నిర్వహించిన తోట బడి కార్యక్రమంలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. తేనే మంచు పురుగు, తేనే పురుగు, కాయతొలుచు పురుగు, కాయపగుళ్ల నివారణకు స్పైనోసార్డ్ 0.3 మిల్లీలీటర్లు లేదా డైఫెన్ ఓనజాల్ 0.5 మిల్లీలీటర్లు వేప నూనె 1500 బీపీఎంను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖాధికారులు కె.ప్రియదర్శిని, వి.రాజ్ గోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


యువకుడి మృతిపై విచారణకు విజయవాడకు పోలీసులు

ఉండి: భీమవరానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి అభిరామ్ ఇటీవల మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా విజయవాడకు ప్రత్యేక బృందాన్ని పంపించినట్లు పోలీసులు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగించుకుని మార్చి 28న విజయవాడ నుంచి రైల్లో వస్తున్న విద్యార్థి అభిరామ్ ఉండి మండలం కలసిపూడి పంట కాలువలో శవమై తేలడంతో తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందంటూ అతడి తండ్రి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడలో రైలు ఎక్కక ముందు ఏం జరిగిందనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మదన గోపాలస్వామి రథోత్సవం

పెనుగొండ: ఆచంటలో రుక్మిణీ శ్రీసత్యభామ సమేత మదన గోపాలస్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరు పెద్దిరాజు, ఎంపీపీ కేఎస్ నారాయణ రెడ్డి(వాసు) పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీ నిరంతర ప్రక్రియ



తూర్పుపాలెంలో మినిమించిలిపాడుకు చెందిన ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో పోడూరు మండలం మినిమించిలి పాడుకు చెందిన 13 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఒకేసారి 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అర్హులకు 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు అందిస్తున్నారని తెలిపారు. పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్ రామన వీర్రాజు, ఉప సర్పంచ్ పాతగొలుసు రాముడు, మండల మాజీ కన్వీనరు రుద్రరాజు శివాజీరాజు, పిల్లి నాగన్న, నలిమిల్లి బాబిరెడ్డి, బాలం సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

పెనుగొండ: ప్రజలకు అండగా ఉండేది ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో పెనుగొండ జవ్వాది వారి వీధికి చెందిన నల్లం తాతారావు, నల్లం పోతురాజు, నల్లం కనకారావు, నల్లం ప్రసాద్, నల్లం లక్ష్మీనారాయణలతో పాటు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అన్ని వర్గాలకు సమన్యాయం సీఎం జగన్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నల్లిమిల్లివేణుప్రతాపరెడ్డి(బాబిరెడ్డి), పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్, బాలం పెద్దిరాజు, ఆసునగరి, నేలపూడి లక్ష్మణరావు, పోడూరి అప్పాజీ, త్సవటపల్లి బుజ్జి, సుంకర నాగబాబు పాల్గొన్నారు.